

మన్యంలో మత్తు!

- ఏజెన్సీలో జోరుగా గంజాయి దందా
- సరిహద్దు రాష్ట్రాల నుంచి సరఫరా
- వ్యసనం బారిన పడుతున్న యువత
- పోలీసులకు పెను సవాల్
- అవగాహన కల్పిస్తున్నా ఫలితం అంతంత మాత్రమే..

వాజేడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో మన్యం జోగుతోంది. ఈ మహమ్మారికి యువత బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వీరి బలహీనత అక్రమార్కులకు సంపదను కూడబెడుతోంది. ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, తాడ్వాయి, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో చాపకింద నీరులా విస్తరిస్తోంది. నిఘా వ్యవస్థ ఎంత అప్రమత్తంగా ఉండి, కొరడా ఝళిపిస్తున్నా ఇంకా ఇది కొనసాగుతూనే ఉంది.

మాదకద్రవ్యాల సేవనం ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమయ్యేది. ఇప్పుడు ఈ విష సంస్కృతి పల్లెలకూ పాకింది. ముఖ్యంగా గ్రామీణుల్లో గంజాయి వ్యసనంగా మారింది. టీనేజీ నుంచి నడి వయసు ఉన్న వారు దీనికి అలవాటు పడుతున్నారు. ఈ మహమ్మారి బారిన పడి మానసికం, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారు. గంజాయి మత్తులో ఎలాంటి అఘాయిత్యానికైనా పాల్పడుతున్నారు. తమ బిడ్డల్లో ఇలాంటి పైశాచికాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఒక సిగరెట్.. రూ.50

గంజాయి సిగరెట్ రూ. 50లకు దొరుకుతోంది. కొన్నిసార్లు దీని కంటే అధిక ధరను చెల్లించైనా యువకులు దీన్ని సేవిస్తున్నారు. అక్రమార్కులు చిన్నచిన్న పొట్లాల్లో గంజాయిని సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. సాధారణంగా మార్కెట్‌లో దొరికే సిగరెట్ నుంచి పొగాకును తీసేసి ఈ పొట్లాల్లో ఉన్న గంజాయిని నింపి అమ్ముతున్నారు. దీనికి అలవాటు పడిన యువత వేలాది రూపాయలు ఖర్చు పెడుతూ ఆర్థికంగా చితికిపోవడమే కాకుండా అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులు గిరిజన, మధ్య తరగతి యువకులనే టార్గెట్ చేసుకొని దీని మత్తులోకి దించుతున్నారు.

సరిహద్దు రాష్ట్రాల నుంచి సరఫరా

ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, తాడ్వాయి మండలాలకు గంజాయి సరిహద్దు రాష్ట్రాలు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ నుంచి సరఫరా అవుతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా భద్రాచలం ప్రాంతం నుంచి ములుగు మీదుగా హైదరాబాద్ వరకు సైతం దీన్ని తరలిస్తున్నట్టు సమాచారం. అత్యధికంగా ఆంధ్ర-ఒడిశా రాష్టాల సరిహద్దుల నుంచి గంజాయి ఎక్కువగా సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది.

పోలీసులు చర్యలు తీసుకుంటున్నా...

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మాదకద్రవ్యాలపై కఠినంగా వ్యవహరిస్తుండటంతో పోలీసులు నిఘాను పటిష్ఠం చేశారు. గంజాయి అలవాటు ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. వెంకటాపురం సర్కిల్ పరిధిలోని వాజేడు, వెంకటాపురం, పేరూరు స్టేషన్లలో గంజాయి కేసులు నమోదయ్యాయి. వాజేడు స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు నమోదు కాగా సుమారు 16 కిలోల గంజాయి లభ్యమైంది. 19 మందిపై కేసులు నమోదయ్యాయి. అదే విధంగా పేరూరు స్టేషన్ పరిధిలో సుమారు 250గ్రాముల గంజాయి దొరకగా 8 మందిపై కేసులు రిజిస్టర్ అయ్యాయి. వెంకటాపురం స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు నమోదు కాగా సుమారు 14.500 కేజీల గంజాయి దొరికింది. 16 మందిపై కేసులు నమోదు చేశారు. ఒక్క ఏడాది కాలంలోనే ఈ మూడు స్టేషన్ల పరిధిలో ఇంత మంది గంజాయిని సేవిస్తున్న యువకులు దొరికారంటే ఇంకా పోలీసులకు చిక్కకుండా తీరుగుతున్న వారు ఎంత మంది ఉన్నారని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఆయా కార్యక్రమాల ద్వారా అవగాహన

డ్రగ్స్ ఫ్రీ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. యువకులకు ఆటల పోటీలు పెడుతూ వారిలో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొదిస్తున్నారు. యువత చెడు వ్యవసనాల వైపు వెళ్లకుండా సమాజిక స్పృహ కలిగిస్తున్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపేందుకు పకడ్బందీ కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాను అడ్డుకుంటున్నారు. ముఖ్యంగా ములుగు ఎస్పీ శబరీశ్ దీనిపై ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇది కొంత సత్ఫలితాన్నిస్తున్నా పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదని తెలుస్తోంది.



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వాజేడు పోలీసులు (ఫైల్)

ప్రజాపాలన విజయోత్సవాల ఏర్పాట్లు పూర్తిచేయాలి

- ములుగు కలెక్టర్ దివాకర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 29న జరిగే ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశించారు. తన చాంబర్‌లో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావుతోపాటు ఆయా శాఖల అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 29న రాష్ట్రం నుంచి 'ప్రజా ప్రభుత్వం' పిలిచింది అనే పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతడుపుల నాగరాజు సారథ్యంలో వివిధ కళారూపాలలో ప్రభుత్వ కార్యక్రమాలు, గత సంవత్సరం కాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రకాష్, డీడబ్ల్యూవో శిరీష, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్లకు కనీస వేతనం ఇవ్వాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోడెం సమ్మయ్య



కేజీబీవీలో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్, ఉపాధ్యాయులు

ఏటూరునాగారం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేజీబీవీ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం కనీస వేతన విధానాన్ని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోడెం సమ్మయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేజీబీవీ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతో ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయించుకుంటోందని విమర్శించారు. నిరుపేద విద్యార్థులకు విద్యనందిస్తున్న ఉపాధ్యాయుల పట్ల చిన్నచూపు తగదని అన్నారు. చాలీచాలని వేతనాలతో ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు సాధారణ బేసిక్‌పేను అమలు చేయాలని, వసతి గృహాల నిర్వహణ కోసం కేర్ టేకర్‌ను నియమించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు కిరణ్, సంతోష్, ఉపాధ్యాయులు అరుణ, హరిత, శ్రీదేవి, స్వరూప, విజయ, రమ్యకృష్ణ, మమత, నాగలక్ష్మి పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

- ములుగు గట్టమ్మ సమీపంలో ఘటన
- న్యాయం చేయాలంటూ బంధువుల ఆందోళన

ములుగు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ములుగు సమీపంలోని గట్టమ్మ మలుపు వద్ద బుధవారం ఉదయం చోటుచేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లికి చెందిన వనం రాజు(45) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 9గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ములుగుకు బయల్దేరాడు. గట్టమ్మ దేవాలయం సమీపంలోని మలుపు వద్ద 163 జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న కల్వర్టు ప్రదేశానికి చేరుకోగానే వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. రోడ్డుపై పడిన అతడి పైనుంచి లారీ చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో లారీని రోడ్డుపైనే నిలిపిన డ్రైవర్ పరారయ్యాడు. హనుమకొండ వైపు నుంచి ఇసుక లోడ్ కోసం ఏటూరునాగారం వైపు లారీ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం రాజు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



రహదారిపై రాస్తారోకో చేస్తున్న బంధువులు



వనం రాజు (ఫైల్)

జాతీయ రహదారిపై రాస్తారోకో

ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు నిరసనకు దిగారు. ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దీంతో రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున వాహ నాలు నిలిచిపోయాయి. వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు వీరికి సంఘీభావం తెలిపారు. ప్రజల ప్రాణాలు తీస్తున్న ఇసుక లారీలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు వచ్చి వారికి నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. మృతుడు రాజుకు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే గండ్ర



టీటీడీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడును భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర అసెంబ్లీలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. భూపాలపల్లి నియోజకవర్గ భక్తులు స్వామి వారి దర్శనం కోసం తన లేఖ ద్వారా వస్తుంటారని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారిని అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

- బైక్‌పై వచ్చి కత్తులతో దాడి చేసిన దుండగులు
- మహదేవపూర్ మండలంలో ఘటన
- మృతుడి స్వగ్రామం మంచిర్యాల జిల్లా కొమ్మెర

మహదేవపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో బుధవారం రాత్రి హత్య జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఓ యువకుడిని కత్తులతో దాడి చేసి హతమార్చారు. మహదేవపూర్ సీఐ రాంచందర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్ల చెన్నూరు మండలం కొమ్మెర గ్రామానికి చెందిన ముత్యాల శ్రీకాంత్ గౌడ్(25) పంటలు కోసే సొంత హార్వెస్టర్‌తో జీవనోపాధి పొందుతున్నాడు. మహదేవపూర్ మండలం చంద్రుపల్లిలో ఓ రైతుకు చెందిన పొలంలో ఆరు రోజులుగా ఈ యంత్రంతో వరి కోతల పనులు కొనసాగిస్తున్నాడు. స్వగ్రామం కొమ్మెర నుంచి రోజూ వస్తూ పోతూ పనులను పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఎప్పటిలాగే చంద్రుపల్లికి వచ్చిన అతడు పోచమ్మగుడి వద్ద కారును పక్కకు పెట్టి దిగుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కత్తితో దాడి చేసి పరారయ్యారు. దీంతో శ్రీకాంత్ గౌడ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలంలో నిందితులు వదిలి వెళ్లిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని సీఐ తెలిపారు. హత్యకు కారణం తెలియరాలేదన్నారు. శ్రీకాంత్ మృతితో దిగ్ర్భాంతికి గురైన కుటుంబ సభ్యులు ఏమీ మాట్లాడలేక పోతున్నారని అన్నారు. వారితో మాట్లాడి వివరాలు రాబడతామని పేర్కొన్నారు. త్వరలోనే ఈ కేసును ఛేదించి నిందితులను పట్టుకుంటామని చెప్పారు.



శ్రీకాంత్‌గౌడ్ (ఫైల్)



శ్రీకాంత్‌గౌడ్ మృతదేహం

సర్వే సమాప్తం

- భూపాలపల్లి జిల్లాలో పూర్తయిన గణన
- 1,40,436 కుటుంబాల వివరాలు సేకరించిన ఎన్యుమరేటర్లు
- 19 రోజుల్లోనే ముగిసిన ప్రక్రియ
- కొనసాగుతున్న డాటా ఎంట్రీ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో విజయవంతంగా పూర్తయ్యింది. మొత్తం 12 మండలాల్లో 1,40,436 కుటుంబాల వివరాలను ఎన్యుమరేటర్లు సేకరించారు. జిల్లాలో సర్వే వంద శాతం పూర్తయ్యిందని అధికారులు వెల్లడించారు. ఈనెల 9న సర్వే ప్రారంభం కాగా 19 రోజుల్లోనే పూర్తి చేశారు. ఇందులో 1,043 మంది ఎన్యుమరేటర్లు పాల్గొనగా మొత్తం ఇళ్లను 991 బ్లాకులుగా అధికారులు విభజించారు. ఒక్కో ఎన్యుమరేటర్ రోజుకు 15 ఇళ్ల చొప్పున సర్వే చేసేలా ఏర్పాటు చేశారు. 934 మంది ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయిలో సర్వే విధులు నిర్వర్తించగా, మరో 103 మంది రిజర్వ్‌లో ఉన్నారు. సర్వేను 121 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు.

సానుకూలంగానే స్పందించిన జనం

జిల్లాలో జరిగిన సర్వేలో ప్రజల నుంచి సానుకూల స్పందనే వచ్చిందని తెలుస్తోంది. కొన్ని చోట్ల మాత్రమే తమ వివరాలు చెప్పేందుకు ఎన్యుమరేటర్లకు జనం అంతగా ఇష్టపడలేదని సమాచారం. సర్వే ప్రశ్నావళిలో వ్యక్తిగత వివరాల కాలమ్స్ కూడా ఉండటంతో మొహమాటంగానే వివరాలు వెల్లడించారు. అలాగే ఈ సర్వే సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మకు పలువురి నుంచి ఫిర్యాదులు కూడా అందాయి. కొందరు బీసీలు ఎస్సీలుగా నమోదు చేసుకుంటున్నారని చిట్యాల మండలం చల్లగరిగ గ్రామానికి చెందిన ఎస్సీలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇలా చదురుముదురు ఘటనలు మినహా జిల్లాలో సర్వే ప్రశాంతంగా ముగిసింది.

డాటా ఎంట్రీకి 619 మంది ఆపరేటర్లు

జిల్లాలో ఎన్యుమరేటర్లు పూర్తి చేసిన సర్వేను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ ప్రారంభమైంది. డాటా ఎంట్రీ కోసం ప్రత్యేకంగా 619 మంది ఆపరేటర్లను నియమించారు. భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 30వేల కుటుంబాల వివరాలను ఆన్‌లైన్ చేశారని తెలుస్తోంది.

కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణ

సర్వేను విజయవంతం చేసేందుకు కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రత్యేక చొరవ చూపారు. ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. 13 మంది నోడల్ అధికారులను నియమించిన ఆయన ఎన్యుమరేటర్ల పనితనాన్ని స్వయంగా పరిశీలించారు. ఆయా సందర్భాల్లో కాలనీల్లో పర్యటిస్తూ సర్వేకు ఎన్యుమరేటర్లు వచ్చారా.. లేదా? అని నేరుగా కుటుంబాలను ఆరా తీశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ పకడ్బందీగా చేయించడం వల్లే సర్వే విజయవంతమైందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

» 13 వేల బస్తాల రాక
» బోనస్‌తో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే రైతుల మొగ్గు

కేసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ధాన్యం పోటెత్తింది. ఈ ధాన్యం సీజన్లోనే అత్యధికంగా 13,600 బస్తాలను రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. ఇందులో 11,031 బస్తాలకు ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానం ద్వారా వేలం పాటలు నిర్వహించారు.

మార్కెట్‌కు 271 మంది రైతులు 11,031 బస్తాల్లో 7,170 క్వింటాళ్ల ధాన్యం తీసుకురాగా, ఇందులో జైశ్రీరాం రకం ధాన్యం 11 మంది రైతులు 291 బస్తాల్లో 189 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ రకం 137 మంది రైతులు 6,080 బస్తాల్లో 3,952 క్వింటాళ్లు, హెచ్ఎంటీ రకం ధాన్యం 123 మంది రైతులు 4,660 బస్తాల్లో 3,029 క్వింటాళ్లు ఉన్నాయి.

ఈ-నామ్ విధానంలోని 'ఈ-చేలం'లో జైశ్రీరాం రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.3,000, కనిష్ఠంగా రూ.2,729, సగటున రూ.2909, ఆర్ఎన్ఆర్ క్వింటాకు రూ.2702, రూ.2411, రూ.2,686, హెచ్ఎంటీ రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.2,589, కనిష్ఠంగా రూ.2401, సగటున రూ.2,551 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. మార్కెట్లోని కవర్ షెడ్లన్నీ నిండిపోవడంతో పాత మార్కెట్ కార్యాలయం చుట్టూ ఉన్న ఓపెన్ యార్డులోను ధాన్యం రాశులు పోసుకున్నారు.


కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ధాన్యం

వారంలో క్వింటాల్‌కు రూ.150 పెరిగిన ధర

కేసముద్రం మార్కెట్లో ధాన్యం ధరలు ఈ వారం రోజుల్లో క్వింటాకు రూ. 150 చొప్పున ధర పెరిగాయి. ఆర్ఎన్ఆర్ గత వారం రూ.2450 నుంచి రూ.2500 వరకు సగటు ధరలు ఉండగా తాజాగా రూ.2650 నుంచి రూ. 2700 వరకు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బ్రాండెడ్ బియ్యం కంపెనీల నుంచి ధాన్యం డిమాండ్ ఉండడంతో ఇక్కడి వ్యాపారులు ధరలు పెంచి ఖరీదు చేస్తున్నారు. స్థానిక మార్కెట్లో ధర స్వల్పంగా పెరిగిందని తెలుస్తోంది. ఈ ధర మరింత పెరిగే అవకాశం లేదని కొద్దిరోజులు నిలకడగా ఉంటుందని వ్యాపారులు భావిస్తున్నారు. మరోవైపు సన్న ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర (ఎం ఎస్‌పీ) క్వింటాకు రూ.2320 ఉండగా అంతకుమించి మార్కెట్‌లో ధరలు నమోదవుతుండడం గమనార్హం. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అదనంగా క్వింటాకు బోనస్ రూ.500లు కలుపుకొని రూ.2820 చెల్లిస్తున్నారు. దీంతో రైతులు సన్న ధాన్యాన్ని అధికంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే తీసుకువెళ్తుండడంతో మార్కెట్‌కు తక్కువగా సరుకు రాబడులు కొనసాగుతున్నాయి.

మార్కెట్లో నిరంతర పోలీసు బందోబస్తు

కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా వివిధ వర్గాల భద్రత దృష్ట్యా ముందస్తుగా బుధవారం నుంచి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో ధరల తగ్గుదలపై రైతుల ఆందోళనలు, అడుగుల పేరుతో చిల్లర దొంగతనాలు జరిగిన సందర్భాల్లో పరిస్థితి సద్దుమణిగేవరకు నాలుగైదు రోజులపాటు మార్కెట్లో పోలీసుల బందోబస్తు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం మార్కెట్లో ఒక కంపెనీకి చెందిన గుమస్తా, బీహార్ కార్మికులపై కొందరు బయటి వ్యక్తులు కత్తులతో బెదిరించి, దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే రైతులు, కార్మికులు, వ్యాపారులు, మార్కెట్ అధికారులు, సిబ్బంది, ఇతర వర్గాల భద్రత దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మురళీధర్ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

అధికారులంతా ఐకమత్యంతో ఉండాలి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు

ములుగు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులందరూ ఐకమత్యంతో ఉండాలని గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు అన్నారు. ములుగులోని జడ్పీ హాల్‌లో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మట్టపల్లి సంపత్‌రావు అధ్యక్షతన బుధవారం జరగ్గా ముఖ్య అతిథిగా జగన్మోహన్‌రావు హాజరయ్యారు.

ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి అధికారులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. అదేవిధంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ వద్ద ఆర్డీవో రత్నకుమారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో సెక్రటరీ కోల రాజేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ జీవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు కెమసారం కొమురయ్య, సంతోష్, బి.శ్రీనివాస్, శైలజ, రహీం, రాజ్‌కుమార్, యశ్వంత్, దుర్గారావు, రంజిత్, శంకర్‌రావు, బాలయ్య, నరసింహ, సారంగపాణి, రాజేశ్వర్, శిరీష, నరసింహ, విద్యాసాగర, మాధవిశీతల్, రాజేశ్వర్‌రావు, రాజు, రహీం మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ద్వాదశి పూజలు

మహదేవపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ద్వాదశి కావడంతో తెల్లవారుజామునే గోదావరి వద్దకు చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు చీర, సారె, కుంకుమ, పసుపులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. శుభానందదేవి, సరస్వతిదేవి ఆలయాల్లో ఆలయంలో అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గులు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించారు. బ్రాహ్మణోత్తములను దీపాదానం అందజేశారు.


కాళేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపాలిటీ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మహబూబాబాద్ శివారు అనంతారం రోడ్డులో నిర్మితమవుతున్న మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ భవన పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని హంగులతో నిర్మిస్తున్న మునిసిపల్ భవనంలో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, బానోత్ రవికుమార్, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, డౌలాగర్ శంకర్, అంబాల శివకుమార్, రామకృష్ణ, చారి తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాల నమోదు సకాలంలో పూర్తి చేయాలి


రఘునాథపల్లిలో సర్వే కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న సంతోష్

రఘునాథపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సమగ్ర సర్వే రాష్ట్ర కంట్రోల్ అధికారి సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్లు కంప్యూటరీకరణ చేస్తున్న తీరును ఆయన డిప్యూటీ సీఈవో సరితతో కలిసి బుధవారం పరిశీలించారు. సర్వే నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సకాలంలో పూర్తి చేయడానికి అవసరమైన సలహాలు, సూచనలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహిస్ ముజ్జబ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో రఘునందన్ రెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం

తొర్రూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ అలుపెరుగని పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం అన్నారు. బుధవారం తొర్రూరులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఏ బకాయిలు విడుదల చేసి పెండింగ్ బిల్స్, సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర జాక్టో నిర్ణయం మేరకు ఎస్టీయూ పని చేస్తుందని, ఉపాధ్యాయుల వేతన, ఇతర సప్లమెంటరీ బిల్లులు ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, జీపీఎఫ్ బిల్లులు సైతం పెండింగ్‌లో పెట్టడం వల్ల ఉపాధ్యాయులకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మొదటి సారి తొర్రూరుకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుధాకరాచారి, ఉపాధ్యాయులు యాకూబ్ రెడ్డి, చంద్రప్రకాశ్, శ్రీనివాస్, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పూల్‌సింగ్

కాటారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన శాఖలో కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కాటారం ఎస్టీ బాలురు, బాలికల గురుకులాల ఆవరణలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 1,804 మంది, గిరిజన సంక్షేమ గురుకులాల్లో 491, గిరిజన సహకార సంస్థల్లో 94మంది కాంట్రాక్ట్ బోధన, బోధనేతర ఉద్యోగులు పని చేస్తున్నారని ఆయన తెలిపారు. 25ఏళ్లుగా రెగ్యులర్ కాక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య, పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజుతో పాటు సంపత్, రామకృష్ణ, శ్రీనివాస్, కృష్ణమాచారి, సర్దార్‌సింగ్, స్వప్న, సారక్క, పద్మ, రజిత, రాజ శేఖర్, సత్యనారాయణ, యాకమ్మ, మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

పత్తి రైతులు ఆందోళన చెందొద్దు

వరంగల్ వ్యవసాయం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మొత్తం పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందని వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవే ప్రకటించారు. పత్తి కొనుగోళ్ల కోసం వరంగల్ బ్రాంచ్ పరిధిలో 16 జిల్లాల్లో 54 సీసీఐ కేంద్రాలను ప్రారంభించామని, సమీప కేంద్రాన్ని తెలుసుకోవడానికి, వివరాలు, మద్దతు ధరలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం రైతులు 'కాట్-అల్లై' మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇంకా రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే 7718955728కు వాట్సాప్ చేయవచ్చని సూచించారు.

బాదావత్ రాజు అరెస్టు అక్రమం

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బదావత్ రాజును పోలీసులు అదుపులోకి తీసుకోవడం అక్రమమని మానవ హక్కుల వేదిక ఒక ప్రకటనలో ఖండించింది. రాజును ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి కేయూసీ పోలీసుస్టేషన్‌కు పిలిపించి నిర్బంధించడంపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అత్రం భుజంగరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతయ్య, ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.జీవన్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

బంజారా హక్కుల పోరాట సమితి నిరసన కార్యక్రమం ప్రకటిస్తే రాజు అదే సామాజిక వర్గానికి చెందినవాడు అయినందున ఆయనను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు.

వర్గీకరణ చేయకుండా నియామకాలు చేపట్టొద్దు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ మాదిగల జన్మహక్కు అని, ఎస్సీ వర్గీకరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ తెలిపారు. బుధవారం మండలంలోని రంగరాయగూడెంలో నిర్వహించిన మాదిగల చైతన్యసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలబెడతామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు.

డీఎస్సీ, గ్రూపు 1, 2, 3, 4, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగాలు, ఏఈ, హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగాలను వర్గీకరణ లేకుండానే చేసి మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా మేలుకొని మాదిగలకు అన్యాయం జరుగకుండా వర్గీకరణను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్, ఎంఎస్‌పీ జిల్లా నాయకుడు మంద శ్రీనివాస్, సందేన రవీందర్, బొట్ల మహేష్, గంధమల్ల ఉదయ్, గాదె శ్రీధర్, గుర్రం నవీన్, మంద ప్రశాంత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.


ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల నూతన కార్యవర్గం

ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ధనసరి రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండలం చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మల జాతర ప్రాంగణంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ గూడూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయలన్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ఆదివాసీ గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడిగా దారం నరేష్, ప్రధాన కార్యదర్శిగా సోలం ప్రవీన్, ఉపాధ్యక్షులుగా వాసం భద్రయ్య, ధనసరి సారయ్య, పెనక వెంకటేష్, కార్యదర్శులుగా తురస సుధాకర్, బంగారి సుదర్శన్, వట్టం నవీన్, జాయింట్ సెక్రటరీగా ఈసం యాకయ్య, కమిటీ సభ్యులుగా ఈసం సుధాకర్, ఈసం వీరన్న, కొట్టెం రాజేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు తాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి పూనెం జనార్ధన్, దారం సాంబరాజు, పెనక నాగయ్య, తాటి ప్రవీన్, ఈక అశోక్, సిద్దబోయిన ఉపేందర్, కోరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు అంజలీదేవి

కేయూ క్యాంపస్, నవంబరు 27,(ఆంధ్రజ్యోతి): కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల స్టూడెంట్ తోట అంజలీ దేవి మహారాష్ట్రలో జరిగిన వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ పరేడ్ క్యాంపుకు ఎంపికై శిక్షణను దిగ్విజయంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా బుధవారం కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భిక్షాలు, ఎం. వేణుగోపాల్‌రెడ్డిల చేతుల మీదుగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంజలిదేవికి ఎన్ఎస్ఎస్ ప్రీరిపబ్లిక్ పరేడ్ సర్టిఫికెట్‌ను అందచేసి అభినందించారు. నవంబరు 12 నుంచి 21 వరకు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఎన్ఎస్ఎస్ పూణే ప్రాంతీయ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌క్యాంపు-2024 నిర్వహించారు.

కార్యక్రమంలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్లు టి. స్వప్న, తూర్పాటి వెంకటేశ్, అధ్యాపకులు వైష్ణవి, సాయి తరుణ్, సురేందర్‌నాయక్, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ జూడో పురుషుల జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): నవంబరు 28 నుంచి 30 వరకు భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ జూడో పురుషుల జట్టును 2024-25 ఏడాదికి గాను బుధవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో ఎ.ఎల్. లక్ష్మణ్, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి.జయదీప్, (సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వరంగల్), ఎం.ముఖేశ్, పి.నాగేంద్ర, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), ఎం.దర్శిత్‌నాయక్(ఎల్‌బీ కళాశాల, వరంగల్), బి.రాహుల్, (కేయూ స్కూల్ ఆఫ్ లర్నింగ్, కేయూ), జే.మహేశ్(వాగ్దేవి డిగ్రీ కళాశాల, కిషన్‌పుర)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా వాగ్దేవి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రాము వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.


ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2460	2080
పల్లికాయ (సూక)	4000	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	6912	8000
పెసళ్లు	5382	5250
పత్తి	6840	5800
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	---	---
తేజ మిర్చి కొత్తది	14000	12000
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

టూరిస్టుల రాక పెరుగుతోంది

ఫేస్ టు ఫేస్

శివాజీ, ఉమ్మడి జిల్లా పర్యాటక శాఖ అధికారి



ప్రశ్న: పర్యాటకానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎలా ఉంది ?

జ: బాగానే ఉంది. అవసరమైన చోట పర్యాటకుల సౌకర్యార్థం వసతి సౌకర్యాలను, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది.

ప్రశ్న: పర్యాటకుల సంఖ్య గతం కన్నా పెరిగిందా?

జ: రామప్పకు యూనెస్కో గుర్తింపు వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాకు పర్యాటక రాక గతంలో కన్నా బాగా పెరిగింది. రామప్పతో పాటు ఇతర దర్శనీయ స్థలాలను చూసేందుకు ఎక్కువ మంది వస్తున్నారు.

ప్రశ్న: పర్యాటక స్థలాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ? నిధులు ఏమైనా వచ్చాయా ?

జ: రామప్పలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. లక్నావరంలో మరిన్ని సౌకర్యాల కల్పించాం. కురవి, అయినవోలు, ధర్మసాగర్, వడ్డెపెల్లి, కాళేశ్వరం, ఘనపురం, తదితర ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి, ఎకో టూరిజానికి ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

ప్రశ్న: తెలంగాణ దర్శినికి స్పందన ఎలా ఉంది ?

జ: విద్యార్థుల నుంచి మంచి స్పందన ఉంది. ఈ పథకం కింద ఆయా పాఠశాల విద్యార్థులను పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు కార్య ప్రణాళికను రూపొందించాం.

ప్రశ్న: ఉమ్మడి జిల్లా విదేశీల పర్యాటకుల రాక ఎలా ఉంది ?

జ: గతంలో కన్నా ఈ సారి బాగా పెరిగింది. ఈ సంవత్సరం ఇప్పటికే వివిధ దేశాల నుంచి 400 మందికిపైగా వచ్చారు.

ప్రకృతి అందాల పుట్టిల్లు

కొడవటూరు

- ఆధ్యాత్మికంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్న సిద్ధులగుట్ట
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలంటున్న భక్తులు





ధ్యానం కోసం నిర్మించిన పిరమిడ్

బచ్చన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పురాతన దేవాలయాలంటేనే ఎన్నో ప్రత్యేకతలకు నిలయాలు. అలాంటి పురాతన దేవాలయాల్లో ప్రకృతి అందాలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన శైవక్షేత్రం కొడవటూరు స్వయంభూ సిద్ధేశ్వరాలయం ఒకటి. సుమారు 147 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ సిద్ధులగుట్ట చుట్టూ పచ్చని చెట్లు, ఔషధ మొక్కల పరిమళాలు వెద జల్లుతాయి. ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచే ఈ క్షేత్రంలో అనేక దేవతామూర్తుల ఆలయాలతో పాటు, మనస్సుకు ప్రశాంతత చేకూర్చే పిరమిడ్ ధ్యాన కేంద్రం ఉంది. నిత్యం ఇక్కడకు వచ్చే భక్తులకు ఈ ప్రాంత పరిసరాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక్కడి సిద్ధేశ్వరుడి దర్శనానికి వచ్చే ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు.. తన్మయత్వానికి లోనై ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తామంటూ హామీలు ఇస్తుంటారు. కానీ అవేమీ అమలుకు నోచుకోవటం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆలయంలో సిద్దేశ్వరుడు

అభివృద్ధి చేస్తే భక్త సందోహమే..

సిద్ధులగుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడటం ఖాయమంటున్నారు. దశాబ్ద కాలం క్రితం ఈ గుట్టపై ఉన్న మూడు గుండాల్లో స్నానమాచరించనిదే భక్తులు సిద్ధేశ్వరుడిని దర్శించుకునేవారు కాదు. కింది నుంచి గుట్టపైభాగాన ఉన్న గుండాలు సుమారు కిలోమీటర్ దూరంలో ఉంటాయి. ఉరుకుల పరుగుల జీవితం, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో కాలినడకన గుండాల వద్దకు భక్తులు తక్కువగా వెళుతున్నారు.

గతంలో కొడవటూరు సర్పంచ్‌గా పనిచేసిన గంగం సతీష్‌రెడ్డి గుట్టపైకి వాహనాలు వెళ్లే విధంగా రూట్‌మ్యాప్‌తో పాటు పర్యాటక అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను తయారు చేసి, ఎమ్మెల్యే ఆమోద పత్రంతో దేవాదాయశాఖ అధికారులకు పంపారు. అలాగే గుట్ట కింది భాగంలో ఉన్న చెరువును ట్యాంక్‌బండ్ మాదిరిగా అభివృద్ధి చేయడం.. అలయానికి ముందు 30 అడుగుల శివలింగం, హనుమాన్ విగ్రహాలు ఏర్పాటు, ఆలయం వద్ద ఉన్న 6.19 ఎకరాల్లో వాటర్ ఫౌంటేన్లు, ఔషధ, పూల మొక్కల పెంపకం, కోతుల పార్కు, గుట్టచుట్టూ తిరిగేలా సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలో రోడ్డు, నిర్మించి వదిలేసిన పర్యాటక అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవటం లాంటి చర్యలు తక్షణం చేయాలని కోరుతున్నారు. ఇక ఆలయ పరిసరాల్లో వానరాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వీటిని పట్టి అడవుల్లో వదిలేస్తే ఇబ్బందులు తొలగుతామని భక్తులు సూచిస్తున్నారు.



వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో రైల్ కోచ్ రెస్టారెంట్‌కు జరుగుతున్న ఏర్పాట్లు

రైల్ కోచ్ రెస్టారెంట్!

- త్వరలో వరంగల్ రేల్వే స్టేషన్‌లో ఏర్పాటు
- 24 గంటలు అందుబాటులో భోజనం

గిర్మాజిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు రైల్‌కోచ్ రెస్టారెంట్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో వివిధ రుచులతో ఆకట్టుకుంటున్న రైల్ కోచ్ రెస్టారెంట్ తరహాలో త్వరలో వరంగల్ రైల్వేస్టేషన్‌లో కూడా ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రయాణానికి ఉపయోగపడని రైల్ కోచ్‌లను ఆధునికీకరించి రెస్టారెంట్లుగా ఏర్పాటు చేసేందుకు తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రెస్టారెంట్ ఆన్ వీల్స్ పేరుతో తొలి రైల్ కోచ్ క్యాంటీన్ ఏర్పాటుచేసిన అధికారులు రెండో రైల్ కోచ్ రెస్టారెంట్‌ను గత సెప్టెంబరు 11న నెక్లెస్ రోడ్‌లో ప్రారంభించారు. అదే రీతిలో వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ఐవోడబ్ల్యూ కార్యాలయం సమీపంలో రైల్ కోచ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ రెస్టారెంట్ 24గంటలు అందుబాటులో ఉండనుంది. దీనికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను వరంగల్ నగరంలోని ప్రముఖ హోటల్ అయిన శంకర్ విలాస్ యాజమాన్యం పొందింది. రైల్ కోచ్‌ను ఆధునికీకరించే పనులను బుధవారం ప్రారంభించింది. నూతన సంవత్సరం నాటికి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నిర్వాహకులు తెలిపారు.



వరంగల్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్





నెక్లెస్ రోడ్డులోని రైల్ కోచ్ రెస్టారెంట్ ఇదే, సుందరీకరించిన లోపలిభాగం

నారీ శక్తి

పల్నాడు గడ్డపై..



ప్రత్యర్థుల దాడిలో నుదుటిపై లోతైన గాయమైనా.. రక్తం ధారలా కారుతున్నా.. ధైర్యాన్ని కోల్పోలేదు. తాను నమ్మిన పార్టీ కోసం, రాజకీయ సిద్ధాంతం కోసం ప్రత్యర్థులను ఎదిరించి వార్తల్లో నిలిచారు. ఆమె ఎవరో కాదు. ఏపీలోని పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన చెర్రెడ్డి మంజులారెడ్డి. తెలుగుదేశం పార్టీ సాధారణ కార్యకర్తగా ఉన్న ఆమె అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నాటి ఘటన తర్వాత ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతేకాదు పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు దృష్టిలో పడిన ఆమె సాధారణ మహిళా నాయకురాలి నుంచి ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. అలా ఏపీ రాజకీయాల్లో 'వీరవనిత'గా పేరు తెచ్చుకున్న మంజులారెడ్డి ఓరుగల్లు ఆడబిడ్డ కావడం గమనార్హం. భద్రకాళి అమ్మవారు వేంచేసిన నేలపై పుట్టిన మంజులారెడ్డి.. రాణీ రుద్రమదేవి పౌరుషాన్ని.. సమ్మక్క సారలమ్మ పోరాట తెగువను పల్నాటి గడ్డపై చూపారు.

ఓరుగల్లు పౌరుషం



ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మంజులారెడ్డి

- ఏపీ అసెంబ్లీ ఎన్నికల పోరులో ప్రత్యర్థులను ఎదిరించిన చల్లగరిగ ఆడబిడ్డ
- గొడ్డలి గాయమైనా వెనుకడుగేయని మంజులారెడ్డి
- అధినేత ఆశీస్సులతో 'దేశం'లో కీలక నేతగా గుర్తింపు
- ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా ప్రమాణం

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చెర్రెడ్డి మంజులా రెడ్డి.. ఈ ఏడాది మే 13న ఏపీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున వార్తల్లో నిలిచిన మహిళ. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన ఆమె తెలుగుదేశం పార్టీ తరఫున పోలింగ్ బూత్ ఏజెంట్‌గా కూర్చుని.. ప్రత్యర్థి పార్టీ వైసీపీ వారి దాడికి గురయ్యారు. ఆ సమయంలో ఆమె నుదుటిపై గొడ్డలి వేటు కారణంగా లోతైన గాయమైంది. రక్తమోడుతున్నా ధైర్యం కోల్పోకుండా ఆమె ఏజెంట్‌గా తన బాధ్యతను నిర్వర్తించి వీర వనితగా వార్తల్లో నిలిచారు.

అలా పార్టీ కోసం కట్టుబడిన ఆమె ధైర్యాన్ని మెచ్చుకున్న టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్ర బాబు సాధారణ నాయకురాలిగా ఉన్న ఆమెను ఏపీ శిల్పా రామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా నియమించి.. ప్రత్యేక గుర్తింపునిచ్చారు. అంతలా పార్టీ కోసం ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రత్యర్థులకు ఎదురొడ్డి నిలిచిన మంజులారెడ్డి పుట్టిపెరిగింది ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే. మెట్టినింట తెలంగాణ పౌరుషాన్ని, రాణిరుద్రమదేవి ధీరత్వాన్ని ప్రదర్శించిన మంజులారెడ్డి ఇటీవల ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ వరంగల్ ఆడపడుచు.. తనకు ఓరుగల్లు నేలతో ఉన్న అనుబంధాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

నేను చల్లగరిగె ఆడపడుచును..

నా స్వస్థలం ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగే గ్రామం. చల్లగరిగే అనగానే గుర్తొచ్చేది ప్రముఖ పాట రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్. ఆయనది, మాదీ ఒకే గ్రామం. నాన్న మోర్తాల బూసిరెడ్డి, అమ్మ అన్నపూర్ణ. మాది పెద్ద కుటుంబం. ఏడుగురు సంతానం. ఒక అన్న, ఆరుగురు అక్కలు. అందరికన్నా నేనే చిన్నదానిని. నా బాల్యమంతా పచ్చని పొలాలు, మట్టి మనుషుల మధ్య గడిచింది. చదువు కూడా చల్లగరిగలోని ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. చిన్నతనంలో ఎంతో అల్లరి చేసిన నేను ఆటల పోటీల్లో ఎప్పుడూ ముందుండేదాన్ని. దేనికీ భయపడని మనస్తత్వాన్ని నాకు పల్లె వాతావరణమే నేర్పింది. ఏడుగురు సంతానంలో చిన్నదాన్ని కావడంతో అందరూ గారాబంగా చూశారు. కానీ పెళ్లి కారణంగా పదోతరగతితోనే చదువు ఆపేయాల్సి వచ్చింది.

ఆంధ్రా సం'బంధం' ఎలాగంటే..

పక్కా తెలంగాణలో పుట్టిన నాకు ఆంధ్రాతో బంధం ఏర్పడటానికి మా దగ్గర బంధువైన వేణుగోపాల్ రెడ్డి కారణం. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి ఆర్ఎంపీగా ఆంధ్ర ప్రాంతంలో కూడా వైద్యం చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆయన అక్కడ అమ్మాయిని వివాహం చేసుకోవడంతో ఏర్పడిన పరిచయాలు, బంధుత్వాలతో నాకు ఆ పల్నాడు జిల్లా రెంటాల గ్రామానికి చెందిన చెర్రెడ్డి కోటిరెడ్డితో వివాహమైంది. నా భర్త కోటిరెడ్డి టీడీపీ నాయకుడిగా గతంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి వైసీపీ వారి ఆరాచకాలను ఎదిరించి సర్పంచ్‌గా గెలిచారు. అప్పుడు నాకు అంతగా రాజకీయాలంటే ఇష్టం లేకపోయినా ఓ సాధారణ మహిళా కార్యకర్త గా నా భర్త తరఫున ప్రచారం చేశా. కానీ గత ఐదేళ్లలో వైసీపీ శ్రేణుల ఆరాచకాలను చూసి నాకు బాధేసింది. కోపం కూడా వచ్చేది. కానీ సంయమనం పాటించా. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో నా భర్త, ఇతర మహిళా నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నా. క్రియాశీలకంగా వ్యవహరించా. చివరకు పోలింగ్ రోజున మా గ్రామంలోని పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్నా. కానీ వైసీపీ వారు దుర్మార్గానికి దిగారు. టీడీపీ తరఫున ఏజెంట్లు లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. ఆక్రమంలోనే వైసీపీ వర్గీయులు నాపై దాడి చేశారు. రోడ్డుపై పడేసి గొడ్డళ్లతో గాయపరిచారు. అయినా వెనక్కి తగ్గకుండా నుదుటన గొడ్డలి గాటు పడినా.. రక్తం కారుతున్నా బూత్‌లోనే కూర్చుని వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నా. పోలింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నా. నాలా కష్టపడే సాధారణ కార్యకర్తకు టీడీపీలో సముచిత స్థానం లభిస్తుందనడానికి.. ఓ కీలకమైన కార్పొరేషన్‌కు సీఎం చంద్రబాబు నన్ను చైర్‌పర్సన్‌గా నియమించడమే ఉదాహరణ.

ఓరుగల్లు పౌరుషం నారక్తంలోనే ఉంది

మెట్టినిల్లు ఆంధ్రా అయినా నా రక్తంలోనే ఓరుగల్లు పౌరుషం ఉంది. ఆ తెగింపుతోనే నేను వైసీపీ మూకలను ఎదుర్కోగలిగా. నేను ఏ స్థాయిలో ఉన్నా పుట్టినిల్లయిన చల్లగరిగె.. ఉమ్మడి ఓరుగల్లుతో నా అనుబంధం కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పటికీ చల్లగరిగెకు రాకపోకలు సాగుతూనే ఉన్నాయి. వరంగల్, నెక్కొండ, రాఘవాపూర్, శనిగరంలో బంధువులు ఉన్నారు. తెలంగాణ పౌరుషం.. రాణి రుద్రమదేవి ఇచ్చిన ధీరత్వమే నన్ను నడిపిస్తోంది.. ఆటైనా పాటైనా, పోరాటమైనా అన్నిటా ముందు నిలిచేలా నా పుట్టినూరు చల్లగరిగే చైతన్యం నింపింది. ప్రస్తుతం హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా బాధ్యతల స్వీకరించిన తర్వాత నేను రాజకీయాల్లో మరింత క్రియాశీలంగా ఉండాలనుకుంటున్నా. వీలైనంత మేరకు ప్రజలకు సేవ చేయాని నిర్ణయించుకున్నా. చల్లగరిగె ఆడబిడ్డగా పల్నాడు రాజకీయాల్లో నాదైన ముద్ర వేయాలనుకుంటున్నా.

పరిమళించిన పల్లె చిత్రం

- ఆర్ట్స్ ఫొటోగ్రఫీలో రాణిస్తున్న ఫక్రుద్దీన్
- పేదరికాన్ని జయించి.. అవార్డుల వైపు నడుస్తున్న మరిపెడ వాసి
- సామాజిక సేవలోనూ తనవంతు పాత్ర

మరిపెడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పుట్టింది పేద కుటుంబంలో అయినా తనకున్న ప్రతిభను ప్రపంచానికి చూపాడు. ఆర్ట్స్ ఫొటోగ్రఫీలో రాణించి గోల్డ్ మెడల్ సంపాదించాడు. పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో సత్తా చాటి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అంతేకాదు ఫొటోగ్రఫీలో తాను సంపాదించే మొత్తంలో నుంచి కొంత సొమ్మును సామాజిక సేవలకు వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.. మరిపెడ బంగ్లాకు చెందిన ఫక్రుద్దీన్. ప్రకృతి రమణీయ ఫొటోల చిత్రీకరణ ఫక్రుద్దీన్ హాబీ. అయితే కమర్షియల్ ఫొటోగ్రాఫర్‌గా జీవనాన్ని ఆరంభించిన ఫక్రుద్దీన్ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలులో జన్మించారు. ఏడో తరగతి వరకు చదివారు. నిరుపేద కుటుంబం కావడంతో ఇరువైయేళ్ల క్రితం జీవనోపాధి కోసం మరిపెడబంగ్లాకు వలస వచ్చి టైలరింగ్ వృత్తిలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకున్న ఫక్రుద్దీన్ టైలరింగ్ వృత్తిని ఫొటోగ్రాఫర్‌గా మారి ఆర్ట్స్ ఫొటోలపై మక్కువ పెంచుకొని అనతి కాలంలోనే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తనదైన శైలిని ప్రదర్శిస్తూ అనేక బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు.

ఫొటోగ్రఫీలోని కొత్త ఒరవడులకు నాంది పలికిన ఫక్రుద్దీన్ నేటి ఫొటోగ్రాఫర్లకు మార్గదర్శకుడిగా నిలిచారు. మరిపెడ మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలోనే మరిపెడ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఫొటోగ్రాఫర్లకు డ్రెస్ కోడ్‌కు బీజం వేశారు. ఎప్పటికప్పుడు ఫొటోగ్రఫీలో మెళకువలను నేర్చుకుంటూ సాధన చేస్తూ ఆర్ట్స్ ఫొటోలను బంధించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్నారు.









సామాజిక సేవలోనూ..

ఫక్రుద్దీన్ తను బతుకుదానికి కమర్షియల్ ఫొటోగ్రాఫర్‌గా ఎదిగి, ఓ వైపు ఆర్ట్స్ ఫొటోగ్రఫీలో రాణిస్తూనే సామాజిక సేవలో తనకు సరిలేరెవ్వరని నిరూపించుకుంటున్నారు. వరంగల్ రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రక్తదాన శిబిరాన్ని మరిపెడబంగ్లాలో ఏర్పాటు చేయించి వందల యూనిట్ల రక్తాన్ని ఫొటోగ్రాఫర్ల ద్వారా రెడ్‌క్రాస్‌కు అందచేసి అప్పటి ఉమ్మడి వరంగల్ కలెక్టర్ ఆమ్రపాలి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అలాగే పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు.

పతకాల పంట..

ఫక్రుద్దీన్‌కు ఆర్ట్స్ ఫొటోగ్రఫీలో పతకాల పంట పండింది. ఇప్పటి వరకు 10 బంగారు పతకాలు, 4 బ్రాంజ్ మెడల్స్, 15ఎఫ్ఐపీ రిబ్బన్స్ సాధించారు. దాంట్లో భాగంగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీలో ఆర్టిస్ట్ ఎఫ్ఐపీ డిస్టింక్షన్ పొందారు. అలాగే ఫెడరేషన్ మల్టీ కల్చరల్ ఫొటోగ్రఫిక్ ఆర్ట్ అమెరికా గౌరవ ఎక్సలెన్స్ హానర్‌ను సాధించారు. ఈ మెడల్ డిసెంబరు 1న ఆయనకు ఆ సంస్థ విజయవాడలో అందజేయనుంది. ఇవే కాక మరో రెండు బంగారు పతకాలు దక్కించుకున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషన్ ఎఫ్ఐఏపీ డీఎల్ ఆర్ట్స్ క్రియేషన్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక సంస్థలు నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొని మరో ఐదు అవార్డు దక్కించుకున్నారు. మొట్టమొదటగా తెలుగు రాష్ట్రాల్లోని రాచకొండ ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొని నగదు పారితోషికంతో పాటు సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నారు. కేరళ రాష్ట్రంలోని ఓ పోటీల్లో పాల్గొని బెస్ట్ అవార్డు అందుకున్నారు.



ఫక్రుద్దీన్ అందుకున్న పతకాలు



సైకిల్ కనుమరుగు.. ఉపాధి దేవుడెరుగు..

ఒకప్పుడు సైకిల్ అంటే సామాజిక హోదా. సైకిల్ ఉందంటే సమజాంలో ఓ గౌరవం ఉండేది. ఏ పనికి వెళ్లాలన్నా సైకిల్‌నే ఉపయోగించేవారు. అంతెందుకు పెళ్లి కుదిరిందంటే వధువు తల్లిదండ్రులు వరుడికి వరకట్నాల కింద సైకిల్, గడియారం లాంటి పెట్టేవారు. ఇక ఆ రోజుల్లో సైకిల్ ట్యాక్సీలు కూడా ఉండేవి. దాంతో నాడు సైకిల్ అద్దెకిచ్చే దుకాణాలు, పంక్చర్ షాపులు ఉండేవి. కానీ ఇప్పుడు వాహనాల వాడకం పెరగడంతో సైకిల్ తొక్కేవారి సంఖ్య బాగా తగ్గింది. ఒక వేళ వందలో ఒకరో ఇద్దరో సైకిల్ వినియోగించినా.. అవి కూడా ట్యూబ్‌లెస్ టైర్లవే ఉంటున్నాయి. దీంతో పంక్చర్ షాపుల వారికి ఉపాధి తగ్గిపోయింది. దాంతో వారిలో చాలామంది బైకుల టైర్లకు పంక్చర్లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎంతైనా ఒకప్పటిలా గిరాకీ ఉండటం లేదని, తమ ఉపాధి ఎలాగో ఆ దేవుడికే తెలియాని పంక్చర్ షాపు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో ఇలా.. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో చిన్న పాటి పంక్చర్ షాపును నిర్వహిస్తున్న ఈ మెకానిక్ గిరాకీ కోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

- వర్ధన్నపేట రూరల్, ఆంధ్రజ్యోతి

గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపర్చాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సౌకర్యాలను మెరుగుపర్చేందుకు పెద్ద ఎత్తున ఉపాధిహామీ పనులు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. ఉపాధిహామీ పథకం, పంచాయతీ ఎన్నికలు, ప్రజాపాలన, ప్రజా విజయోత్సవ వేడుకలు, సామాజిక సర్వే డేటా ఎంట్రీ తదితర అంశాలపై సమీక్షించారు. రానున్న మూడు నెలలు ఉపాధిహామీ పథకం చేపట్టడం చాలా కీలకమన్నారు. వేతన రేటు పెంచేందుకు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధిహామీ వేతన రేటు జిల్లాలో ప్రస్తుతం రూ.198 ఉందని, రూ. 250కి పెంచాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలో 23,38,117 పనిరోజుల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 18,32,324 రోజుల పనిచేసినట్లు తెలిపారు. ఇందుకు వేతనాల కింద రూ. 3629.43 లక్షలు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 2472.76 లక్షల చెల్లింపులు చేసినట్లు వివరించారు. పల్లె, పట్టణ ప్రకృతి వనాల నిర్వహణలో లోపాలు ఉండొద్దన్నారు. ప్రతి ఇంటి నుంచి వ్యర్థాల సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను గుర్తించి సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రమే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎంపీడీవోలు సహాయ ఎన్నికల అథారిటీగా వ్యవహరిస్తారన్నారు. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన, ప్రజావిజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలన్నారు. సామాజిక సర్వే డేటా ఎంట్రీని వేగవంతం చేయాలన్నారు. మల్హర్ మండలం డేటా ఎంట్రీలో వెనుకపడిందన్నారు. 18 శాతం మాత్రమే డేటా పూర్తి చేశారన్నారు. అవసరమైన సిబ్బందిని కేటాయించి డేటా ఎంట్రీని వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఆర్డీవో నరేష్, డీపీవో నారాయణరావు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలి

వ్యవసాయంలో రైతులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు సహకార సంఘాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. రెవెన్యూ, సహకార, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్థక శాఖల వరంగల్, కరీంనగర్ డీసీసీబీ డీజీఎం, ఎంజీఎంలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రైతుల సంక్షేమం కోసం నూతన బహుళార్థ మత్స్య, గొర్రెల పెంపకందారులు, వ్యవసాయ, ఉద్యాన, కల్లుగీత కార్మికులు, మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాల న్నారు. జిల్లాలో ప్రస్తుతం సహకార శాఖ ఆధ్వర్యంలో 10 సంఘాలు ఉన్నాయని, అదనంగా ఎనిమిది బహుళ ప్రయోజన సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టనున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

ప్రజా ఆరోగ్యం పుస్తకం ఆవిష్కరణ

వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపందించిన ప్రజా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ పుస్తకాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో ముదుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి పాల్గొన్నారు.

బియ్యం బస్తాల్లో కిలోల కొద్దీ కోత

మొగుళ్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల గోదాం నుంచి రేషన్ డీలర్లకు సరఫరా అయ్యే బియ్యం బస్తాల్లో కిలోల కొద్దీ తక్కువగా వస్తున్నాయి. ప్రతినెల రేషన్‌కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యంలో తక్కువ వస్తుండడంతో రేషన్ డీలర్లు, లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. పలుమార్లు అధికారులు జిల్లా అధికారులకు తెలిపినప్పటికీ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తు న్నాయి. భూపాలపల్లి జిల్లాలో చిట్యాల, మహదేపూర్ మండలాల్లోని గోదాముల నుంచి వివిధ మండలాలకు సరఫరా అయ్యే బియ్యం బస్తాల్లో కిలోలకొద్దీ తక్కువగా వస్తున్నట్లు డీలర్లు లబోదిబోమంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లోని రేషన్‌షాపులు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, వసతిగృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ గోదాముల నుంచి బియ్యం సరఫరా అవుతున్నాయి.

గోదాముల్లో గోల్‌మాల్

ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ప్రతి నెలవారీ కోటా ప్రకారం రేషన్‌షాపులకు బియ్యం బస్తాలు సరఫరా చేస్తారు. బస్తా బరువు 50కిలోలతోపాటు 150 గ్రాముల గన్నీ సంచి బరువు కలిపి 50 కిలోల 150 గ్రాముల బియ్యం తూకం వేసి ఇవ్వాల్సి ఉంది. చిట్యాల, మహదేవపూర్ ఎంఎల్ఎస్ గోదాం పాయింట్ల నుంచి ఆయా గ్రామాల్లోని రేషన్‌షాపులు, ప్రభ్వు పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బియ్యం బస్తాలను రేషన్ డీలర్లు, వార్డెన్లు, అంగన్‌వాడీ టీచర్లు, స్పెషలాఫీసర్లు, కేర్‌టేకర్లు తూకం వేస్తే ఒక్కో బస్తా బరువు 46,47,48 కిలోలు ఉంటున్నాయి. ఒక్కో బస్తాకు రెండు నుంచి నాలుగు, ఐదు కిలోల తరుగు వస్తున్నాయి. దీ ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

తూకం వేయకుండానే..

పౌరసరఫరాలోని చిట్యాల, మహదేవపూర్ మండలాల్లో ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ప్రతినెలా సరఫరా అయ్యే బియ్యం బస్తాలను తూకం వేయకుండానే రేషన్‌షా పులకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బస్తాల్లో కోత షరా మామూలే అయింది. ఈసమస్యను ప్రతినెలా ఎదుర్కోవడం తప్పడం లేదని డీలర్లు అంటు న్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే 50 కిలోల బస్తాకు రెండు నుంచి ఐదుకిలోల వరకు బియ్యం తక్కువ గా వస్తున్నట్లు పేర్కొంటున్నారు. బియ్యం సరఫరాను పారదర్శకంగా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపులో ఈ-పాస్ యంత్రాలను అమలు చేసినా ఫలితం కనిపించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారులు మాత్రం గన్నీసంచి బరువుపోను బియ్యం బస్తా 50కిలోలు ఉంటుందని చెబుతున్నారని తెలుస్తోంది.

పోలీసులు ప్రజలతో సత్సంబంధాన్ని కలిగి ఉండాలి

నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలతో సత్సంబంధాన్ని కలిగి ఉండి ప్రతి గ్రామాన్ని సందర్శించాలని ఎస్పీ శబరీశ్ అన్నారు. ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి తగిన చర్యలు చేపట్టాలని, ఎస్సీ ఎసీలు, మహిళలపై జరిగే నేరాలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సరిహద్దు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా నివారించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో సూచికబోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. దొంగతనాలు, ఆర్థిక నేరాల్లో ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా దర్యాప్తు ముమ్మరం చేయాలన్నారు. ఎస్సీఎస్టీ, మహిళలపై జరిగే నేరాల్లో వీలైనంత త్వరగా విచారణ చేసి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి అమ్మేవారిపై, తరలించే వారిపై నిఘాను పటిష్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు శంకర్, రవీందర్, శ్రీనివాస్, బండారి కుమార్; ఎస్బీ ఇన్‌స్పెక్టర్ అజయ్, సీసీ ఎస్సై రమేష్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, సతీష్, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజొద్దీన్, సురేష్, హరీష్, కృష్ణప్రసాద్, తిరుపతిరావు, వెంకటేష్, డీసీఆర్‌బీ ఎస్సై జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

న్యూస్ రీల్

కేంద్ర సచివాలయ ట్రెయినీ సెక్షన్ ఆఫీసర్ల పర్యటన

కాటారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటారం, నస్తూరుపల్లి గ్రామపంచాయతీల్లో కేంద్ర సచివాలయ ట్రైనీ సెక్షన్ అధికారులు బుధవారం పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరిశీలించారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వాటర్ హార్వెస్టింగ్, ఫారం పాండ్స్, సెగ్రిగేషన్ షెడ్, శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలను ఎస్‌వోలు అమిత్‌చౌదరి, అంకిత్‌గుప్తా, కృష్ణ టాప్పో, ప్రవీణ్ తాయల్, అనూప్‌సింగ్ పరిశీలించారు. ఉపాధి కూలీలు, పెన్షనర్లతో మాట్లాడారు. శిక్షణలో భాగంగా ఆరు రోజులపాటు మండలంలో వీరు పర్యటించున్నారు. వారి వెంట ఈజీఎస్ ఏపీవో వెంకన్న, ఈసీ శ్రీనివాస్, టీఏ మనోజ్, కార్యదర్శులు సమీర్‌ఖాన్, సురేష్ తదితరులు ఉన్నారు.

న్యాస్ పరాక్ సర్వేను విజయవంతం చేయాలి

ములుగు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 4న జరిగే న్యాస్ పరాక్ సర్వేను విజయవంతం చేయాలని ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు డీఈవో పాణిని సూచించారు. ములుగులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ములుగు జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో సర్వే విజయవంతం చేయడంలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల పాత్ర కీలకమన్నారు. సర్వే సందర్భంగా విద్యార్థులు వందశాతం పాఠశాలలకు హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాస్ పరాక్ జిల్లా కోఆర్డినేటర్ ఇ.సూర్యనారాయణ, సమగ్రశిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ కాటం మల్లారెడ్డి, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, రిసోర్స్‌పర్సన్లు సోమారెడ్డి, సూర్యనారాయణ, మల్లయ్య, ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా అజయ్ కుమార్



గోవిందరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ ములుగు నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలానికి చెందిన కోగిల అజయ్ కుమార్ నియామకమయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల వెంకన్న, ములుగు జిల్లా అధ్య క్షుడు రాజశేఖర్‌వర్మ నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షులకు అజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు స్థల పరిశీలన

ములుగు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామంలో నూతన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుకు భూమిని కేటాయించడం కోసం డీఎంహెచ్‌వో గోపాల్‌రావు బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విజేందర్, గ్రామ కార్యదర్శి రాజులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని సర్వేనంబర్ 1896లో గల పదిగుంటల భూమిని గుర్తించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి రూ.3కోట్ల అంచనా వ్యయంతో నివేదికన ప్రభుత్వానికి పంపించినట్టు తెలిపారు. అనంతరం ఆయన ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌ను సందర్శించి సిబ్బంది హాజరు రిజిష్టర్, రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు.

ఎలక్ట్రానిక్ డిటోనేటర్ టెస్ట్ డ్రైవ్

కాకతీయఖని, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ నూతన వొరవడికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం అండర్‌గ్రౌండ్ గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గును, మట్టిని వెలికి తీసేందుకు ఎలక్ట్రికల్ డిటోనేటర్లను వాడుతుండగా వాటి స్థానంలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను అందుబాటులోకి తేనున్నారు. ఈ క్రమంలో బుధవారం భూపాలపల్లి ఏరియాలోని ఓసెన్ కాస్ట్-2,3లలో టెస్ట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డిటోనేటర్ల ద్వారా సేఫ్టీ ఎక్కువ ఉండి సౌండ్ పొల్యూషన్, వైబ్రేషన్ తక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు.

అస్తవ్యస్తంగా విద్యా వ్యవస్థ : ఎస్‌ఎఫ్ఐ

కాటారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరణ్ ఆరోపించారు. మండలకేంద్రంలో సంఘం నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ కేసులు వెలుగుచూస్తున్న ప్రభుత్వం స్పందించకపవడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నారాయణపేట, మణుగూర్ జడ్పీహెచ్‌ఎస్‌ల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై సమగ్ర విచారణ చేసి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రస్నా, రమ్య, దివ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ మండల అధ్యక్షుడిగా సమ్మయ్య



వాజేడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ల మండల యూనియన్ అధ్యక్షుడిగా అరికెల్ల సమ్మయ్య, ప్రధాన కార్యద ర్శిగా తాటి రవి, ఉపాధ్యక్షుడిగా యాలం రాంబాబును ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో 17 జీపీల ఫీల్డ్ అసిస్టెంట్లు బుధవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు గౌరిబాబు, ఆదినారాయణ, రామకుమారి, గాంధీ, జ్యోతి, వినోద్, విజయ, సరబాబు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మొగుళ్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంఈవో ఎల్.కుమారస్వామి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పాఠశాలల ఆవరణ, వంటశాలను సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి బుధవారం జరిగే ఫిజియోథెరపీ క్యాంపును సందర్శించి పిల్లలతోపాటు తల్లిదండ్రులు హాజరుకావాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

ముగిసిన సింగరేణి స్థాయి పోటీలు

కాకతీయఖని, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి లెవల్ చెస్, క్యారమ్స్ పోటీలు బుధవారం ముగిసాయి. భూపాలపల్లి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించగా ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. చెస్ సింగిల్‌లో ఆర్జీ-1 ఏరియా జీడీకే-2 గనిలో పనిచేసే జనరల్ మజ్దూర్ మహేందర్ మెదటి బహుమతిని గెలుచుకున్నారు. క్యారమ్స్ సింగిల్‌లో ఎస్ఆర్‌పీ ఏరియా ఆర్కే-6లో పనిచేసే జనరల్ మజ్దూర్ సృజన్‌రావు మొదటి బహుమతిని గెలుచుకున్నారు. చెస్ డబుల్స్‌లో భూపాలపల్లి ఏరియాని కేటీకే-8గనిలో పనిచేసే జనరల్ మజ్దూర్ వెంకటస్వామి విజయం సాధించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలి : డీఎస్‌వో తేజోవతి



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో తేజోవతి

ఏటూరునాగారం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించాలని డీఏవో తేజోవతి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో డివిజన్‌లోని వ్యవసాయ శాఖ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఈవోలు తమ క్లస్టర్ పరిధిలోని రైతు బీమా పెండింగ్ క్లయిమ్‌లను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సహించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిం చాలన్నారు. సమావేశంలో ఏడీఏ అవినాశ్ శర్మ, ఏవోలు వేణుగోపాల్, చేరాలు, జితేందర్, శ్రీధర్, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన కలిగి ఉండాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్ కుమార్

ఏటూరునాగారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యాధి నిరోధిక టీకాలపై వైద్య సిబ్బంది పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విపిన్ కుమార్ అన్నారు. ఏటూరునాగారం మండలం రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏటూరునాగారం రెండో ఆరోగ్య ఉప కేంద్రాన్ని శిశు ఆరోగ్యం, టీకాల నియంత్రణ జిల్లా అధికారి రణధీర్‌తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేసి, టీకాల కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. వ్యాధి నిరోధిక టీకాల ప్రాముఖ్యతపై వైద్య సిబ్బంది పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డెమో సంపత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పూర్ణ సంపత్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత

వెంకటాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తగూడెం, రామచంద్రాపురం గ్రామాలతోపాటు మండలకేంద్రంలో ప్రజా పాలన విజయోత్సవాలపై బుధవారం కళాజాత కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా కళాజాత సారధి గోల్కొండ బుచ్చన్న బృందం సభ్యులు ఆట,పాటల ద్వారా కళా ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు వివరిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో కళాకారులు కనకం రాజేందర్, కుమార్, భాస్కర్, భద్రయ్య, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలపై అవగాహన

వెంకటాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూగూరు గ్రామంలో బుధవారం ఏపీజీవీబీ సేవలపై వీఎస్ఆర్ రూరల్ మీడియా కళాకారులు కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు సేవలు, బీమా పథకాలు, రుణాల మంజూరు, సురక్ష పథకం, జీవనజ్యోతి, పీఎం యోజన, పెన్షన్ పథకాలపై కళా ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీజీవీబీ మేనేజర్ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్ వినోద్‌కుమార్, సిబ్బంది రాజు, తదితరులు పాల్గొన్నారు.

- మొగుళ్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపల్లి, పిడిసిల్ల గ్రామాల్లో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మొట్లపల్లిశాఖ ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ నర్సింహారావు మాట్లాడుతూ పట్టా పాస్‌బుక్కు కలిగిన రైతులు పంట రుణాలు, రైతునేస్తం గోల్డ్‌లోన్లు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బ్యాంకులో డిపాజిట్‌పై అధిక వడ్డీ ఉందని, ప్రజలందరూ ఈ బ్యాంకులోనే డిపాజిట్ చేసుకోవాలని కోరారు. గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం, తదితర ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో బ్యాంకు క్యాషియర్ డి.రంజిత్‌కుమార్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సన్నాలకు బోనస్

ఐదుగురు రైతులకు రూ 1.48 లక్షల చెల్లింపు

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ జిల్లాలో అమల్లోకి వచ్చింది. మొదటిసారి ఐదుగురు రైతులు దీంతో లబ్ధిపొందారు. మొగుళ్లపల్లి మండలానికి చెందిన రైతులకు పౌరసరఫరాల అధికారులు క్వింటాలుకు రూ.500 చొప్పున చెల్లించారు.రైతులు లింగారెడ్డి, విజయ, సంజీవ్‌రెడ్డి, ఆదయ్య, రాయకొ మరయ్య నుంచి 296.8 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు రూ.1,48,400 లక్షలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

భూటారం గ్రామస్థులకు ఇళ్లు నిర్మించాలి

పెసా కో ఆర్డినేటర్ ప్రభాకర్

ఏటూరునాగారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూటారం గ్రామస్థులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ అన్నారు. ఏటూరునాగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామమైన భూటారంలో బుధవారం పెసా గ్రామ సభ జరిగింది. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలిం చేందుకు తీర్మానం చేశారు. ప్రతి సంవత్సరం గోదావరి, జంపన్నవాగు వరదలు సంభవించినప్పుడు తమను పునరావాస కేంద్రానికి తరలించడం, ఆ తర్వాత తిరిగి పంపడం అధికారులకు పరిపాటిగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సురక్షిత ప్రాంతంలో ఇళ్లు నిర్మించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామ ప్రజలు, పెసా గ్రామ సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రభాకర్ మాట్లాడుతూ పెసా గ్రామ సభల ద్వారా తీసుకొనే నిర్ణయాలు చట్ట పరంగా అమలవుతాయన్నారు. తుపాకులగూడెం ఆర్‌బీ రహదారి వద్ద సుమారు 95 మంది ముంపు బాధిత కుటుంబాలకు ఇందిరమ్మ గృహాలు నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. పోడు భూములకు పట్టాలు, ఇందిర జలప్రభ బోర్ల సౌకర్యం, మటుకుంటా చెరువుకు మరమ్మతులు చేపట్టాలన్నారు. భూటారం గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, కుల పెద్దలు సోయం కన్నయ్య, పెసా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, సభ్యులు సోయం లక్షణరావు, భూచిమల్లు తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న సీఎంఆర్ ధాన్యం

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లర్లకు కేటాయించి ధాన్యం సీఎంఆర్ రూపంలో తిరిగి సర్కారుకే చేరాలి. జిల్లాకు చెందిన ఓ మిల్లర్ మాత్రం అందుకు విరుద్ధంగా అక్రమ మార్గంలో ప్రభుత్వ సొమ్ముకు భారీ గండికొడుతున్నాడు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి.ప్రభుత్వానికి సీఎంఆర్ చెల్లించేందుకు వరంగల్ జిల్లాలో తీవ్ర నష్టాల్లో ఉన్న బాయిల్డ్ రైస్ మిల్లును లీజుకు తీసుకొని అక్కడి రైతుల నుంచి తక్కువ ధరకు పచ్చి వడ్లను కొనుగోలు చేస్తున్నాడు. అక్కడ మర ఆడించి సీఎంఆర్ చెల్లింపులు చేస్తున్నట్లు సమాచారం. అయితే సీఎంఆర్ చెల్లింపు చేసే విషయంలో పీడీఎస్ రైస్‌ను కుడా వాడుతున్నట్లు సమాచారం. స్టేజ్-2 కాంట్రాక్టర్‌గా ఉన్న ఓ మిల్లర్ ఇందులో భాగస్వామి కావడంతో ప్రభుత్వానికి సీఎంఆర్ విషయంలో పీడీఎస్ రైస్ సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో జిల్లాలో గతంలో సివిల్‌సప్లయ్ శాఖలో విధులు నిర్వహించి ఇటీవలే బదిలీ అయిన అధికారి భాగస్వామిగా ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.

బాల్య వివాహాలు సామాజిక దురాచారం





ఏటూరునాగారంలో మాట్లాడుతున్న జీసీడీవో రమాదేవి, భూపాలపల్లిలో విద్యార్థినుల మానవహారం

టూరునాగారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు సామాజిక దురాచారమని ములుగు గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బాలల పరిరక్షణ అధికారి ఎస్.హరికృష్ణ అధ్యక్షతన వహించగా రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు అనర్థకమన్నారు. బాలికల అభివృద్ధికి అవి నిరోధికమని అన్నారు. బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో బాల్యవివా హాలను తగ్గించడంలో చేసిన కృషికి జిల్లా బాలల పరి రక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్ర మంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో ర్యాలీ

భూపాలపల్లి కృష్ణకాలనీ (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సహాయ వెల్ఫేర్ అసోసియేషన్, జిల్లా బాలల సంరక్షణ విభాగం సంయుక్తంగా బాల్ వివాహ్ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. జంగేడు కస్తూర్బా పాఠశాల వద్ద ఈ ప్రదర్శనను గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శైలజ ర్యాలీని జెండా ప్రారంభించారు. అక్కడి నుంచి ర్యాలీ అంబేద్కర్ కూడలి వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. శైలజ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాల న్నారు. ఈ కార్యక్రమంలో సఖి అడ్మినిస్ట్రేటర్ గాయత్రి, సహాయ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి వంగ రాజకమల్‌రెడ్డి, స్వప్న, శ్రీలత, కోమల, అశోక్ పాల్గొన్నారు.

డాటా ఎంట్రీ పకడ్బందీగా చేయాలి

అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

కాటారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) విజయలక్ష్మి డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఆదేశించారు. మండల ప్రజాప రిషత్ కార్యాలయంలోని డాటా ఎంట్రీ సెంటర్‌ను అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపరేటర్లకు డాటా ఎంట్రీకి సంబంధించిన ముఖ్యమైన సూచనలు అందించారు. వెబ్‌సైట్‌లో తరుచుగా ఎర్రర్స్ వస్తున్నాయని ఆపరేటర్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అడిషనల్ కలెక్టర్ వెంట ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఏపీవో వెంకన్న తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అభినందనీయం : డీఎస్పీ

కాటారం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి):సీసీ కెమెరాల ద్వారా పటిష్ట నిఘా ఏర్పాటుకు చర్యలు చేపట్టిన పోలీసులకు వర్తక, వాణిజ్యరంగాల ప్రతినిధులు, నాయకులు, ప్రజలు ఆర్థికంగా సహకరించడం అభినందనీ యమని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పలు అసోసియేషన్ల ప్రతినిధులతో పోలీస్ అధికారులు బుధవారం రాత్రి సమావేశమయ్యారు. సీసీ కెమెరాల ఏర్పాటు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కలికోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కవ్వాల శేఖర్, కోశాధికారిగా ఎం.డి.రఫీ, కార్యవర్గ సభ్యులుగా పంతకాని సమ్మయ్య, నాయిని శ్రీనివాస్, కొట్టె శ్రీహరి, ప్రభాకర్, పులి అశోక్, బొమ్మన రవీందర్‌రెడ్డి, కామిడి వెంకట్‌రెడ్డి, బండి శ్రీనివాస్, మిడిదొడ్డి రాజు, కొట్టె శ్రీశైలం, చినాల రమేష్, దారం నగేష్, ఆత్మకూరి కుమార్ యాదవ్ ఎన్నికయ్యారు. కమిటీ ఆధ్వర్యంలో రూ.11లక్షలతో బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేశారు. పలువురు కాలనీల ప్రజలు విరాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ పాల్గొన్నారు.